క్లుప్తంగా

జేకే ఓసీ పరిశీలన



కార్మికులతో మాట్లాడుతున్న రంగనాథ్

ఇల్లెందు: జేకే ఓసీ పని ప్రదేశాన్ని గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్ బృందం సందర్శించి పరిశీలించింది. బుధవారం సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్‌తో కలిసి ఓసీని సందర్శించారు. ఓసీ కాల పరిమితిని పెంచేందుకు పని ప్రదేశంలో తీసుకుంటున్న జాగ్రత్తలను పరిశీలించారు. ఓబీ ఏరియాలో జరుగుతున్న పనులను, కోల్ బెంచ్ గ్యాలరీల దగ్గర తీసుకుంటున్న జాగ్రత్తలను పరిశీలించారు. క్వారీలో లైటింగ్ ఏర్పాట్లు, మొబైల్ లైటింగ్ ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రొడక్షన్ సందర్భంగా అత్యధికంగా 15 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించిన జేకే ఓసీ కార్మికులను రంగనాథ్ అభినందించారు. అత్యధికంగా 5,100 టన్నుల బొగ్గు ఉత్పత్తి తీసినందుకు ఏ-రిలే కార్మికులను ప్రత్యేకంగా అభినందించారు.

ఎక్కువ మందికి 'ఉపాధి' కల్పించాలి



మాట్లాడుతున్న డీఆర్డీఓ మధుసూదన్‌రాజు

జూలూరుపాడు: ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని డీఆర్డీఓ మధుసూదన్‌రాజు అన్నారు. బుధవారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సరీల నిర్వాహణ పట్ల అలసత్వం వహించరాదన్నారు. ప్రతి మొక్కను సంరక్షించాలని, మొక్కలు చనిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా నర్సరీల్లో కన్వర్షన్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ తాళ్లూరి రవి, ఈజీఎస్ ఏపీఓ రవికుమార్, పంచాయతీ సెక్రటరీలు, ఈజీఎస్ టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: ఉపాధి హామీ పనుల్లో ప్రతి గ్రామపంచాయతీలో ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించాలని ఎంపీడీఓ జి.రవీంద్రప్రసాద్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ హాజరైన క్షేత్ర సహాయకులకు సిమ్ కార్డులను పంపిణీ చేసి మాట్లాడారు. ఉపాధి పనుల్లో కూలీలకు రోజుకు రూ.257 కూలి ఇచ్చేవిధంగా పనులు చేయించాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ పోరండ్ల రంగా, ఈసీ పుల్లయ్య పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన తప్పనిసరి



పాల్వంచరూరల్: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నప్పయ్య

పాల్వంచరూరల్: ప్రతిఒక్కరికీ వినియోగదారుల హక్కులపై అవగాహన ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.చిన్నప్పయ్య అన్నారు. లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ డే సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రతి వినియోగదారుడు ఏ వస్తువు కొనుగోలు చేసినా తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు. దీని ద్వారా మనకు నష్టం జరిగినప్పుడు వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయడానికి బిల్లు ప్రధాన ఆధారమన్నారు.

సుజాతనగర్: ప్రతి వినియోగదారుడు తన హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకోవాలిన్సిన అవసరం ఉందని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ బి.బానుమతి అన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక విశ్వశాంతి స్కూల్‌లో జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టినప్పటి నుంచి ప్రతిఒక్కరూ వినియోగదారుడేనన్నారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం వలన భద్రత, నాణ్యత పరిశీలన, నష్టపరిహారం పొందే హక్కులు ఉన్నట్లు చెప్పారు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లు తప్పనిసరిగా తీసుకుంటే ఏదైనా లోపం వస్తే ఫిర్యాదు చేసి వినియోగదారుల ఫోరం ద్వారా నష్టపరిహారం పొందవచ్చన్నారు. న్యాయవాదులు పురుషోత్తం, ఊటుకూరి పురుషోత్తమరావు, కాసాని రమేష్, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు పాల్గొన్నారు.

పురాతన ఆలయానికి పూర్వవైభవం

- భక్తుల కొంగు బంగారం.. శ్రీసంతాన వేణుగోపాల స్వామి
- కాకర్ల గుడికి 200 ఏళ్లకు పైగా చరిత్ర
- ప్రభుత్వం, దాతల చేయూతతో సుందర రూపం
- 17న ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవం





కాకర్ల పాలగుట్టపై నూతనంగా నిర్మించిన ఆలయం (ఇన్‌సెట్) రుక్మిణీ సహిత సంతాన వేణుగోపాలస్వామి

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల సమీపాన పాలగుట్టపై స్వయంభూగా వెలిసిన శ్రీ రుక్మిణి సహిత సంతాన వేణుగోపాలస్వామిని కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా భక్తులు కొలుస్తారు. సంతానం లేని వారు వేడుకుంటే సంతానం కలగడంతో స్వామికి శ్రీసంతాన వేణుగోపాలస్వామిగా కూడా పేరుంది. కాకతీయుల కాలంలో ఆలయ నిర్మాణం జరిగిందని కొందరు.. త్యాగరాజుల కాలంలో ఆలయాన్ని నిర్మించారని మరికొందరు చెబుతారు. త్యాగరాజు వంశీయుల్లో ఏడో తరం వారు ఆలయాన్ని సందర్శించారని, త్యాగరాజు ఈ ప్రాంతీయుడేనని చెబుతున్నా సరైన ఆధారాలు మాత్రం లభించ లేదు. మరోపక్క కాకతీయ రాజుల విజయానికి చిహ్నంగా ఆలయానికి తూర్పు దిక్కున పాలగుట్ట కింద ఏర్పాటు చేసిన రాతి స్తంభం ఉండటం విశేషం. ఇక అన్నవరం ఆలయంలో శివకేశవులు ఉన్నట్లుగానే కాకర్ల ఆలయంలోనూ శ్రీసంతాన వేణుగోపాలస్వామితోపాటు శివలింగం ఉండటం ఇంకో విశేషంగా చెబుతారు.

శ్రీసంతాన వేణుగోపాలస్వామిగా ప్రసిద్ధి..

కాకర్ల సమీపాన పాలగుట్టపై ఉన్న శ్రీసంతాన వేణుగోపాల స్వామి దర్శనానికి ప్రతీ శుక్రవారం రాష్ట్ర నలమూలల నుంచి భక్తులు వస్తారు. సంతానం లేని వారు స్వామి వారిని ఐదు వారాల పాటు దర్శించుకోవడంతో పాటు శ్రీనాగేంద్రస్వామి పూజ చేస్తే ఫలితం ఉంటుందని నమ్మిక. హోలీ పండుగ రోజున శ్రీరుక్మిణీ సమేత వేణుగోపాల స్వామి వారి కళ్యాణం, శ్రీకృష్ణాష్టమి రోజున ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పాలగుట్ట పరిసర ప్రాంతాలు పచ్చని చెట్లతో ఆహ్లాదభరితంగా వాతావరణం ఉండడం, ఆలయాన్ని చేరుకోవడానికి రహదారి సౌకర్యం ఉన్న నేపథ్యాన కాస్త అభివృద్ధి చేస్తే పర్యాటక ప్రాంతంగా విరాజిల్లే అవకాశం ఉంటుంది.

ఆలయం నిర్మాణం జరిగిందలా..

స్వయంభూగా వెలిసిన శ్రీ రుక్మిణీ సహిత సంతాన వేణుగోపాల స్వామి వారికి సుమారు 111 ఏళ్ల క్రితం కాకర్లకు చెందిన అల్లాడి పుల్లయ్య, అల్లాడి లింగయ్య ఆధ్వర్యంలో ఆలయం నిర్మాణం చేపట్టారు. ఆలయంలో రుక్మిణీ సహిత సంతాన వేణుగోపాల స్వామి వారి విగ్రహంతోపాటు, శ్రీనాగలింగేశ్వర స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు చెబుతున్నారు. 1960లో నెల్లూరు జిల్లాకు చెందిన తాపీ మేస్త్రీ నాగయ్య తన అనుచరులతో కాకర్లలో పక్కా గృహాలు రాగా.. ఆయనకు కలలో స్వామి కనిపించాడని చెబుతూ యాదవ కులస్తులు, గ్రామపెద్దల సహకారంతో 1965లో ఆలయాన్ని నిర్మించారు. ఆ తర్వాత విగ్రహాలను బందిపోట్లు ధ్వంసం చేయగా.. 1990లో గ్రామపెద్దలు నూతన విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఇక నాలుగేళ్ల క్రితం గుట్టపైకి వెళ్లేలా ఘాట్ రోడ్ నిర్మాణమైంది.

రేపు ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవం..

1965లో నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరడం, మూడేళ్ల క్రితం పిడుగుపాటుకు ధ్వంసం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేయడంతో 2020 డిసెంబర్ 28న పనులు ప్రారంభించారు. దాతల చేయూత, గ్రామస్తులు ఢిల్లీ వెంకటేశ్వరరావు, చెరుకుమళ్ల కృష్ణయ్య రూ.5 లక్షల చొప్పున రూ.10లక్షలు అందజేయగా ఆలయ పునర్నిర్మాణం పూర్తయింది. ఈనెల 17వ తేదీ శుక్రవారం ఆలయంలో శ్రీ రుక్మిణి సహిత సంతాన వేణుగోపాలస్వామి,. ధ్వజ విమాన శిఖరం, శ్రీ నాగలింగేశ్వర స్వామిని పునఃప్రతిష్ఠించనున్నారు.



పాలగుట్ట పైనుంచి కనిపిస్తున్న పచ్చని పరిసరాలు

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి



ఆలయ అభివృద్ధిలో భాగస్వామి కావడాన్ని అదృష్టంగా భావిస్తున్నా. స్వామి దర్శనానికి రాష్ట్ర నలుమూలలు నుంచి భక్తులు వస్తారని మా పెద్దలు చెప్పేవారు. ఆధ్యాత్మిక క్షేత్రంగానే కాకుండా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే మరింత మంది వస్తారు. – చెరుకుమల్ల కృష్ణయ్య, కాకర్ల వాసి

మహిమాన్వితమైన ఆలయం



స్వామి వారు స్వయంభూగా వెలిసారు. మహిమాన్వితమైన ఆలయంలో మా తాతల కాలం నుంచి ప్రత్యేక పూజలు చేసేవారని చెబుతారు. నూతనంగా నిర్మించినప ఆలయంలో ఈనెల 17న పునఃప్రతిష్ఠాపన జరగనుండగా.. రానున్న రోజుల్లో భక్తుల రద్దీ పెరుగుతుందని భావిస్తున్నాం. – అల్లాడి నరసింహారావు, కాకర్ల వాసి

కాకతీయుల కాలం నాటి ఆలయం



ఇది కాకతీయుల కాలం నాటి అతి పురాతమైన ఆలయం . ఏపీ రాష్ట్రం కృష్ణా జిల్లా గంపలగూడెం మండలం నెమలిలోని ఆలయం తర్వాత ఈ ఆలయాని విశిష్టత ఉంది. కార్తీక మాసం, శ్రీకృష్ణాష్టమి, నాగులచవితి, కార్తీక పౌర్ణమి, హోలీ పర్వదినాలలో ఇక్కడ ప్రత్యేక పూజలు జరుగుతాయి. – హరి సుబ్బారావు, న్యాయవాది, కాకర్ల

అందరి సహకారంతోనే...



ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేయగా.. దాతలు, శ్రీకృష్ణసేవా సమితి సహకారంతో ఆలయ పునఃనిర్మాణం చేపట్టాం. అన్నవరంలో మాదిరి ఇక్కడ శ్రీవేణుగోపాల స్వామితోపాటు, మహాశివ లింగం ఉంటుంది. – ఢిల్లీ వెంకటేశ్వర్లు, కాకర్ల వాసి

పేదల ఇంటి కల నెరవేర్చండి



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ చర్యలు వేగవంతం కావాలని, దీనిలో భాగంగా పేదల ఇంటికల నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఇంటిస్థలం ఉన్నవారికి రూ.3 లక్షలు అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో కొత్తగూడెం తహసీల్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. మాట్లాడుతూ.. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో జరిగిన అవకతవకలను సరిచేసి, అర్హులకు న్యాయం చేయాలన్నారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరుగుతుందే తప్ప పేదల బతుకుల్లో మార్పులు రావటం లేదని, ఎన్నో ఏళ్లుగా పేదలకు గూడు కల్పించేందుకు పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ గృహకల్ప, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారనే తప్ప పేదలకు న్యాయం జరగడం లేదన్నారు. అనంతరం తహసీల్‌లో పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఎస్కే సాబీర్‌పాషా, వై.శ్రీనివాస్‌రెడ్డి, మునిగడప వెంకటేశ్వర్లు, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య పాల్గొన్నారు.

జేకే ఓసీ ఉద్యోగులకు జీఎం అభినందన

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని జేకే ఓసీలో బొగ్గు ఉత్పత్తి రవాణా దినోత్సవం పురస్కరించుకొని అత్యధిక బొగ్గు ఉత్పత్తి రవాణా చేసిందుకు ఉద్యోగులను జీఎం షాలేమురాజు అభినందించారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మూడు షిఫ్టులలో 14,146 టన్నులు ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. ప్రాజెక్టు అధికారి పంజాల శ్రీనివాస్, కాలరీ మేనేజర్ పూర్ణ చందర్‌రావు, శివ ప్రసాద్, శ్రీహరి పాల్గొన్నారు.

భట్టి పాదయాత్రను విజయవంతం చేయండి

ఇల్లెందు: సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క ఆదిలాబాద్ జిల్లాలో గురువారం ప్రారంభించనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు చీమల వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం ఇల్లెందులో జరిగిన పార్టీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలు సాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో దొడ్డా డానియేల్, పులి సైదులు, రామారావు, కాయం రమేష్, హరికృష్ణ పాల్గొన్నారు.

సుజాతనగర్: తెలంగాణ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టనున్న 'హాథ్ సే హాథ్ జోడో' పాదయాత్రను జయప్రదం చేయాలని టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు పిలుపునిచ్చారు. సుజాతనగర్‌లో బుధవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాదయాత్ర మార్చి 16 నుంచి అదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం హత్నూర్ మండలం పిప్రీ గ్రామంలో ప్రారంభమై జూన్ 15 వరకు మొత్తం 91 రోజులు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. చింతలపూడి రాజశేఖర్, మడిపల్లి శ్రీనివాస్, భద్రరావు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీ ఆటలు సాగనివ్వం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్రంలో మతోన్మాద బీజేపీ ఆటలు సాగనివ్వమని, బీజేపీ మతోన్మాద కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సంక్షేమం, మతసామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం సీపీఎం అఖిల భారత కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో మార్చి 17 నుంచి 29 వరకు జనచైతన్య యాత్ర నిర్వహించనున్నామని సీపీఐ(ఎం) నాయకులు కాసాని ఐలయ్య, అన్నవరపు కనకయ్య అన్నారు. బుధవారం కొత్తగూడెంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ యాత్ర మార్చి 19న చర్ల మండలంలోకి ప్రవేశించనుందని, అన్నివర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించాలి

పాల్వంచ: తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర వహించిన ఉద్యమకారులను ప్రభుత్వం విస్మరించిందని తక్షణం వారిని అన్ని విధాల ఆదుకోవాలని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. బుధవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో అమర వీరుల స్తూపం వద్ద తెలంగాణ అమరవీరుల సాధన ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టారు. ఎడవల్లి కృష్ణ సంఘీభావం తెలిపి మాట్లాడారు. తెలంగాణా ద్రోహులను వీరులుగా చూపి అందలం ఎక్కించారని విమర్శించారు. కోదండరాం వంటి వారిని కేసీఆర్ తన అధికార దాహం కోసం పక్కన పెట్టారన్నారు. తెలంగాణ కోసం సోనియాగాంధీ ఎదుట మోకరిల్లి తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ పార్టీనే లేకుండా చేయాడానికి కుట్రలు పన్నారని ఆరోపించారు. ఉద్యమ సమయంలో ఇంటిని, ఆరోగ్యాన్ని వదిలేసి, స్వరాష్ట్రం కోసం అనేక మంది జైలు పాలయ్యారని, మరెందరో అమరులయ్యారన్నారు.



సంఘీభావం తెలుపుతున్న ఎడవల్లి కృష్ణ

వారి కుటుంబాలతో పాటు, తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, దేవదానం, ఎండీ యూసఫ్, కలకోట అయిలయ్య, గుర్రం సుధాకర్, ముత్యం, పెద్దిబాబు, మాతంగి హరికృష్ణ, జయరాజు, తంగేటి రాము, గౌస్‌పాషా, ఉబ్బన శ్రీను, రవికుమార్, సురేశ్‌బాబు, నవీన్, సందీప్, మోహన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు తొలిరోజు బుధవారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజవర్గాల్లోని పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగాయి. నిమిషం నిబంధన అమలు చేయడంలో విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. అన్ని కేంద్రాలలో సిట్టింగ్ స్క్వాడ్, సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను ఆయా తహసీల్దారులు, డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు తనిఖీ నిర్వహించారు. నేటి నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు







పాల్వంచరూరల్: పరీక్ష రాస్తున్న దివ్యాంగురాలు మోతి, వాకర్‌తో వస్తున్న విద్యార్థి, టేకులపల్లిలో..

జియో 5జీ సేవలు ప్రారంభం

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని జియో కార్యాలయంలో 5జీ సేవలను ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, కోఆప్షన్ సభ్యుడు చెక్కల సుందర్, సర్పంచ్ రతన్‌నాయక్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

టేకులపల్లి: టేకులపల్లి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ దుద్దుకూరి బాలరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు. ప్రగతి నివేదికలతో పాటు గత సర్వసభ్య సమావేశంలో చర్చించిన అంశాలు, సమాధాన ప్రతులను కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

నగదు వితరణ

టేకులపల్లి: ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి బుధవారం రాత్రి వితరణ కార్యక్రమం నిర్వహించారు. దాసుతండాకు చెందిన మాళోతు జగ్గయ్య ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో స్పందించిన ట్రాక్టర్ డ్రైవర్లు నగదు సేకరించి మొత్తం రూ.35వేలు ఏఎంసీ చైర్మన్ బాణోతు హరిసింగ్ నాయక్ చేతుల మీదుగా జగ్గయ్య కుటుంబానికి అందజేశారు.

పాపకొల్లు హైస్కూల్ ఎదుట ధర్నా



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

జూలూరుపాడు: విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాజకీయ, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులతోపాటు, దిశా కమిటీ సభ్యులు బుధవారం పాపకొల్లు హైస్కూల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థినులతో అసభ్యకరంగా మాట్లాడిన ఉపాధ్యాయుడు రామారావును ఉద్యోగ సర్వీస్ నుంచి తొలగించడంతోపాటు, తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని డీఈఓ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, సమగ్ర విచారణ జరిపి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆందోళనకారులకు ఎంఈఓ గుగులోత్ వెంకట్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో మాళోత్ మంగీలాల్ నాయక్, బానోత్ నవీన్ రాథోడ్, వాంకుడోత్ కిషన్ నాయక్, బానోత్ ధర్మా, ఎస్కే సుబాని, శ్రీనాథరాజు నాగరాజు, ఎస్కే నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

జంట పట్టణాల అభివృద్ధే ధ్యేయం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వనమా

పాల్వంచ: పక్కా ప్రణాళికలతో పాల్వంచ, కొత్తగూడెం పట్టణాలను అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక పాత పాల్వంచలో మన బస్తీ – మన బడి కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రూ.45లక్షలు, ప్రాథమిక పాఠశాలలో రూ.35లక్షల వ్యయంతో చేపడుతున్న పక్కా భవనాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. మాట్లాడుతూ.. కేసీఆర్ సహకారంతో కొత్తగూడెం మున్సిపాలిటీకి రూ.115 కోట్లు, పాల్వంచ మున్సిపాలిటీకి రూ.100 కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులతో నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఎంఈఓ శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

పేపర్ లీకేజీపై చర్యలు తీసుకోవాలి



సింగరేణి(కొత్తగూడెం): ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): పోటీ పరీక్షలు నిర్వహించే టీఎస్‌పీఎస్సీ సర్వర్లు హ్యాక్ చేసి ప్రశ్నపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్రా వీరభద్రం డిమాండ్ చేశారు. బుధవారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. మాట్లాడుతూ.. నిరుద్యోగులకు కష్టపడి చదివినా ఉద్యోగాలు రావన్న అభద్రతాభావం ఏర్పడుతుందన్నారు. బాధ్యత వహిస్తూ చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

జూలూరుపాడు: గ్రూప్–1 పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జెమ్మి యశ్వంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జూలూరుపాడులో బుధవారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. యశ్వంత్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో జరిగే అన్ని రకాల పోటీ పరీక్షలను నిర్వహించే టీఎస్‌పీఎస్సీ సర్వర్లను హ్యాక్ చేసి ప్రశ్నపత్రాలను లీక్ చేయడంతో నిరుద్యోగ సమాజం ఆందోళన చెందుతోందన్నారు.

ప్రభుత్వ కనుసన్నల్లోనే..

గ్రూప్–1 పేపర్ లీకేజీ టీఆర్ఎస్ ప్రభుత్వం కనుసన్నల్లోనే నడుస్తోందని టీపీసీసీ సభ్యుడు మాళోత్ రాందాస్ నాయక్ ఆరోపించారు. బుధవారం జూలూరుపాడులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని నవ్వులు పాలు చేస్తున్నారని విమర్శించారు.

ఇల్లెందు: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్యామ్‌కుమార్, ఇ.రాజేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఇల్లెందులో విలేకరులతో మాట్లాడుతూ.. కోచింగ్ తీసుకుని పరీక్షలు రాస్తే నిరుద్యోగలకు పేపర్ లీకేజీ వార్తలు తీవ్రంగా కుంగదీస్తున్నాయన్నారు.

పోడుభూముల్లోకి వెళ్లొద్దు

కొత్తగూడెంరూరల్: పోడు భూముల పూర్తి వివరాలు తెలిసిన తరువాత వ్యవసాయం చేసుకోవాలని అప్పటి వరకు అటవీ అధికారులకు సహకరించాలని ఎఫ్ఆర్ఓ సురేష్ తెలిపారు. బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లిలోని కూనవరం రైతులు పోడు భూముల్లోకి వెళ్లారన్న సమాచారంతో ఫారెస్టు అధికారులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. దీంతో అక్కడి నుంచి రైతులు వెనుదిరిగారు.



అటెన్షన్ ప్లీజ్

వాగులో వ్యర్థాలు.. భరించలేని దుర్గంధం

కొత్తూరు గ్రామ పంచాయతీ జడలచింత గ్రామ సమీపంలోని తుమ్మలవాగు దుర్గంధం వెదజల్లుతోంది. వాగులో ప్లాస్టిక్ వస్తువులు, కోళ్ల వ్యర్థాలు వేయడంతో దుర్వాసన వస్తోంది. మండల కేంద్రానికి ప్రతినిత్యం రాకపోకలు కొనసాగించే ప్రజలు మార్గమధ్యంలో ఉన్న వాగు వద్ద ముక్కులు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి. గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం తడి, పొడి చెత్తలను సేకరించేందుకు ట్రాక్టర్ల ఇవ్వడంతోపాటు, డంపింగ్ యార్డులను నిర్మించింది. అయినా గ్రామ పాలకులు, అధికారులు నిర్లక్ష్యమే ఈ దుస్థితికి కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – జూలూరుపాడు



ప్రశ్నించాల్సిన అధికారి : డి.రామారావు, ఎంపీఓ, జూలూరుపాడు
సెల్ నంబర్: 9848657608